సాక్షి అనకాపల్లి

బుధవారం । 15 । ఫిబ్రవరి । 2023



అప్పన్న హుండీ ఆదాయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి హుండీ ఆదాయం 41 రోజులకు గాను రూ. 1,95,38,602 వచ్చింది.



తిరునాళ్లకు ఏర్పాట్లు

కల్యాణపులోవ కల్యాణపోతురాజుబాబు (శివాలయం) ఆలయంలో తిరునాళ్లకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 8లో

వాతావరణం

అనకాపల్లిటౌన్: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎం.బి.జి.ఎస్.కుమారి మంగళవారం తెలిపారు. ఉష్ణోగ్రతలు 33.2 నుంచి 33.5, గాలిలో తేమశాతం 77 నుంచి 80, గాలి గంటకు 5 కిలోమీటర్ల వేగంతో వీస్తుందని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

సెపక్ తక్రా క్రీడాకారుల ఎంపిక నేడు

దేవరాపల్లి: ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో సెపక్ తక్రా క్రీడాకారుల ఎంపికను పెదనందిపల్లిలో బుధవారం నిర్వహించనున్నట్లు స్థానిక ఇన్‌చార్జ్ శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు సీహెచ్ వెంకటరెడ్డి, ఎ.శేఖర్, పి.సూరిబాబు తెలిపారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 విభాగాల్లో బాల బాలికలకు వేర్వేరుగా పోటీలను నిర్వహించి క్రీడాకారుల ఎంపిక చేస్తామన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరవుతారన్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఈ నెల 19 నుంచి 21 వ తేదీ వరకు అనంతపురం జిల్లాలో జరిగే అంతర్ జిల్లాల పోటీల్లో వీరు పాల్గొంటారని ఆయన చెప్పారు.

భూముల రీ సర్వే వేగవంతానికి చర్యలు

• జేసీ కల్పనా కుమారి



సర్వేపై చర్చిస్తున్న జేసీ కల్పనాకుమారి

మాకవరపాలెం: జిల్లాలో భూముల రీ సర్వేను వేగవంతం చేసేందుకు అన్నిచర్యలు చేపట్టామని జేసీ కల్పనాకుమారి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలో జెడ్.గంగవరం, శెట్టిపాలెం, బయ్యవరం, పెద్దిపాలెం, జి.గంగరం రెవెన్యూ పరిధిలో ప్రస్తుతం జరుగుతున్న భూముల రీ సర్వేపై చర్చించారు. సర్వేతీరు, ఎదురవుతున్న సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం రీ సర్వేను ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ఈ విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం చేయవద్దని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 250 గ్రామాల్లో రీ సర్వే జరుగుతోందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాదరావు, డీటీ శంకరరావు పాల్గొన్నారు.

వ్యాయామంతో అనారోగ్య సమస్యలకు చెక్



ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌వో హేమంత్, వైద్యాధికారులు, విద్యార్థులు

అనకాపల్లిటౌన్: వ్యాయామంతో అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టవచ్చని డీఎంహెచ్‌వో ఎ.హేమంత్ అన్నారు. ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆరోగ్య మేళా, ర్యాలీ నిర్వహించారు. జెండా ఊపి ఈ ర్యాలీని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. సైకిల్ తొక్కడం దినచర్యగా అలవర్చుకోవాలని సూచించారు. అరుంధతీనగర్, నర్సింగరావుపేట మీదుగా నెహ్రూచౌక్ కూడలి వరకు ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో రాధాబాయి వైద్యాధికారులు వై.మురళీధర్, సీహెచ్ కిశోర్‌కుమార్, కె.జగదీష్, నానాజీ, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): సికింద్రాబాద్ డివిజన్, కాజీపేట-బల్హార్షా సెక్షన్, మకుడి-విరూర్ స్టేషన్‌ల మధ్య మూడో లైన్ పనులు జరుగుతున్న దృష్ట్యా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. ఈ కింద రైళ్లు వయా విజయనగరం, రాయగడ, టిట్లాఘడ్, రాయ్‌పూర్, నాగ్‌పూర్‌ల మీదుగా ప్రయాణిస్తాయి. ఆయా తేదీల్లో ఈ రైళ్లు అనకాపల్లి, సామర్లకోట, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, ఖమ్మం టైన్, వరంగల్, పెద్దపల్లి, రామగుండం, సిర్పూర్ కాగజ్‌నగర్, బల్హార్షా, చంద్రపూర్, వార్ధా స్టేషన్‌ల మీదుగా ప్రయాణించవు. ఈనెల 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు విశాఖపట్నం-న్యూఢిల్లీ-విశాఖపట్నం(20805/20806) ఏపీ ఎక్స్‌ప్రెస్, ఈనెల 16, 23వ తేదీల్లో విశాఖలో బయల్దేరాల్సిన విశాఖపట్నం- గాంధీదాం (20803) వీక్లీ ఎక్స్‌ప్రెస్, ఈనెల 19న గాంధీదాంలో బయల్దేరాల్సిన గాంధీదాం-విశాఖపట్నం (20804) వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లను దారి మళ్లిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 19న పూరీలో బయల్దేరే పూరీ-ఓఖా (20819) ఎక్స్‌ప్రెస్, ఈనెల 15న ఓఖాలో బయల్దేరే ఓఖా-పూరీ(20820) ఎక్స్‌ప్రెస్ విశాఖపట్నం మీదుగా కూడా ప్రయాణాలు సాగించవని పేర్కొన్నారు.

నిండు కుండలు

• జలాశయాల్లో పుష్కలంగా నీటి నిల్వలు
• ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టుకు సమృద్ధిగా నీరు
• జిల్లాలో 85 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగుకు నీటి నిల్వలు



తాండవ రిజర్వాయరు

గరిష్ట నీటిమట్టం 380.00 అడుగులు, ప్రస్తుతం 372.05 అడుగులు, ఆయకట్టు : 51,465 ఎకరాలు

నాతవరం : జిల్లాలోని జలాశయాలు నిండు కుండలను తలపిస్తున్నాయి. వేసవి సమీపించినా ప్రాజెక్టులు నీటితో నిండుగా ఉన్నాయి. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో సాగునీటికి ఢోకా ఉండదని ఇరిగేషన్ అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టు భూములకు పూర్తి స్థాయిలో నీటి సరఫరా చేసినా ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నాయి.

ఖరీఫ్‌కు ముందుగానే నీరు

ఉమ్మడి విశాఖ జిల్లాలో గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో లక్ష్యాన్ని మించి ఆయకట్టుకు నీరు విడుదల చేశారు. గతంలో ఖరీఫ్ సీజన్‌లో సరఫరా చేశాక ప్రాజెక్టుల్లో నీరు అడుగంటిపోయేది. అలాంటిది ఈ ఏడాది దానికి భిన్నంగా నీటి నిల్వలు ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రాజెక్టుల్లో ఉన్న నీటి నిల్వలను పరిశీలిస్తే వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రైతుల అభీష్టం మేరకు ముందుగానే ఆయకట్టుకు నీటిని విడుదల చేసే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి.

85 వేల ఎకరాలకు సరిపడా..

ఉమ్మడి జిల్లాలో మేజరు ప్రాజెక్టు తాండవ రిజర్వాయరు, రైవాడ కల్యాణపులోవ, పెద్దేరు, మేఘాద్రి గెడ్డ, గంభీరం ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి.

గంభీరం	
పూర్తిస్థాయి నీటిమట్టం	38.43 మీటర్లు
ప్రస్తుత నీటిమట్టం	37.64 మీటర్లు
ఆయకట్టు	--------

కొద్దిపాటి వర్షాలు కురిసి, గెడ్డల నుంచి ఇన్‌ఫ్లో పెరిగితే నీటి మట్టాలు పూర్తిస్థాయికి చేరే అవకాశముంది. కోనాం రిజర్వాయర్‌లో మాత్రం నిల్వలు కాస్త తక్కువగా ఉన్నాయి. జిల్లాలో ఇప్పుడున్న నీటి నిల్వలు ఆధారంగా వచ్చే ఖరీఫ్ సీజన్‌లో 85 వేల ఎకరాలకు పైగా ఆయకట్టుకు నీటిని అందించే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు పుష్కలంగా ఉండడంతో భూగర్భ జలాలు కూడా పెరిగాయి. దీంతో తాగునీటి బోర్ల నుంచి సైతం నీరు బాగా వస్తోంది.

పూడిక తీతకు ప్రణాళిక

జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాజెక్టుల పరిధిలోని పంట కాల్వల్లో పూడికతీత పనులు చేసేందుకు ఇరిగేషన్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అనకాపల్లి, కాకినాడ జిల్లాల పరిధిలో సుమారు 120 కిలోమీటర్ల పొడవున ఉన్న తాండవ పంట కాల్వలో పూడిక తీసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇతర ప్రాజెక్టుల పరిధిలో కాలువలను శుభ్రం చేసి, ఖరీఫ్ సీజన్‌లో శివారు ఆయకట్టుకు సైతం నీరు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.


నీటి నిల్వలు బాగున్నాయి



ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా ఒక్క కోనాం రిజర్వాయరు తప్ప మిగతా ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. గతంలో మాదిరి ఖరీఫ్ సాగుకు నీటిని విడుదల చేశాక ప్రాజెక్టులు అడుగంటిపోయే పరిస్థితి లేదు. ఏ మాత్రం వర్షాలు కురిసినా నీటి మట్టాలు మరింతగా పెరుగుతాయి. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో ప్రాజెక్టుల నుంచి రైతులు ఆశించిన విధంగా సకాలంలో నీటిని విడుదల చేస్తాం.

– సూర్యకుమార్, ఇరిగేషన్ ఎస్ఈ, ఉమ్మడి విశాఖ జిల్లా–

ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు, ఆయకట్టు వివరాలు



రైవాడ



కోనాం



కల్యాణపులోవ



పెద్దేరు



మేఘాద్రిగెడ్డ

ప్రాజెక్టు	పూర్తిస్థాయి నీటిమట్టం	ప్రస్తుత నీటిమట్టం	ఆయకట్టు
రైవాడ	114.5 మీటర్లు	111.2 మీటర్లు	22,756 ఎకరాలు
కోనాం	101.25 మీటర్లు	95.6 మీటర్లు	12,276 ఎకరాలు
కల్యాణపులోవ	140.30 మీటర్లు	138.77 మీటర్లు	4,485 ఎకరాలు
పెద్దేరు	137.00 మీటర్లు	134.30 మీటర్లు	19,968 ఎకరాలు
మేఘాద్రిగెడ్డ	18.60 మీటర్లు	17.50 మీటర్లు	1,685 ఎకరాలు

అర్హులైన వారికి బ్యాంకు రుణాలు

• బ్యాంకర్ల కమిటీ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి

కె.కోటపాడు: జగనన్న తోడు పథకంలో భాగంగా అర్హులైన వారికి బ్యాంకర్లు రుణాలందించాలని డీఆర్‌డీఏ పీడీ బి.లక్ష్మీపతి తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాయింట్ లెవెల్ మండల్ లెవెల్ బ్యాంకర్ల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీపతి మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల చెల్లింపులు సమయాల్లో పొదుపు, రుణాల పుస్తకాలు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. తద్వారా డ్వాక్రా సంఘాల వారికి వారి బ్యాంక్ రుణం, పొదుపు తెలుస్తుందన్నారు.

వ్యవసాయ రుణాలను మంజూరుతోపాటు రికవరీలో ఎటువంటి ఇబ్బందులున్నా, వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. నిరుద్యోగ యువకులు స్వయం ఉపాధి కోసం పీఎంఈజీపీ (ప్రధానమంత్రి ఎంప్లాయ్‌మెంట్ గ్యారెంటీ ప్రోగ్రాం), ప్రధానమంత్రి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ పథకాల కింద రుణాలు ఇవ్వాలని సూచించారు. జాయింట్ లెవెల్ ఎల్‌డీఎం రవి, డీపీఎం కుమారస్వామి, కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల పలు బ్యాంక్‌ల మేనేజర్లు, చౌడువాడ ఏపీజీవీబీ మేనేజర్ కె.శ్రావణ్‌బాబు, ఏపీఎం వెంకటలక్ష్మి, పశువైద్యాధికారి సీహెచ్‌వై నాయుడు, ఏఈవో లైలాదేవి పాల్గొన్నారు.

'సెల్ఫ్' విద్యార్థులకు ఎంతో హెల్ప్

• కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి



సెల్ఫ్ ప్రోగ్రాంను కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి వివరిస్తున్న ఉపాధ్యాయులు

సబ్బవరం : విద్యార్థులు తమ విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడానికి ఉపాధ్యాయులు రూపొందించిన ఆన్‌లైన్ ప్రోగ్రాం సెల్ఫ్ ఎవాల్యుయేషన్ అండ్ లెర్నింగ్ ఫర్ ఫ్యూచర్(సెల్ఫ్) ఎంతగానో ఉపయోగపడుతుందని అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. సబ్బవరం మండలం నంగినారపాడు జెడ్పీ హైస్కూల్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. సెల్ఫ్ ప్రోగ్రాంను రూపొందించిన పాఠశాల ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, ఎస్.సోమేశ్వరరావులను అభినందించారు. విద్యార్థులను స్వీయ అభ్యాసం-స్వీయ మూల్యాంకనం వైపు ప్రోత్సహించే విధంగా సెల్ఫ్ ప్రోగ్రాం రూపొందించినట్టు కలెక్టర్‌కు ఉపాధ్యాయులు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు పలు అంశాలను క్షుణ్ణంగా తెలుసుకునేందుకు ప్రత్యేక సరళిని రూపొందించడం అభినందనీయమన్నారు. ఈ టూల్ ఉపయోగించడానికి ఎలాంటి సాఫ్ట్‌వేర్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాల్సి అవసరం లేదన్నారు. పీడీఎఫ్ ఫైల్ ద్వారా వినియోగించుకోవచ్చన్నారు. అదేవిధంగా పాఠశాల, మండల, జిల్లా స్థాయిలో పర్యవేక్షించేందుకు అనువైన డ్యాష్ బోర్డును కూడా రూపొందించారని తెలిపారు. ఎంఈవో ఎస్.అప్పలనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

• ఉమ్మడి విశాఖలో 207 కేంద్రాలు
• విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు
• ఈ నెల 20 నుంచి పరీక్షలు ఆరంభం
• అధికారులతో విశాఖ డీఆర్‌వో శ్రీనివాసమూర్తి సమీక్ష



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న విశాఖ డీఆర్‌వో శ్రీనివాసమూర్తి

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి తెలిపారు. పరీక్షల నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలు ప్రారంభమవుతున్నందున సంబంధిత విభాగాల అధికారులంతా కేంద్రాల్లో పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు.

విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు అవసరమైన బస్సులను అందుబాటులో ఉంచాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. పరీక్షలు జరిగే రోజుల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ఏపీఈపీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. అన్ని కేంద్రాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, అత్యవసర సమయంలో తగిన వైద్యం అందించేందుకు అవసరమైన ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్యశాఖాధికారులకు సూచించారు.

తాగునీటి సదుపాయం, శానిటేషన్ పనులను ఎప్పటికప్పుడు నిర్వహించేలా జీవీఎంసీ అధికారులకు దిశానిర్దేశం చేశారు. సంబంధిత విభాగాల అధికారులంతా సమన్వయంతో పని చేసి, ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు పూర్తయ్యేందుకు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

నైతిక విలువల పరీక్ష నేడు

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో భాగంగా బుధవారం ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆర్ఐవో ఉమారాణి తెలిపారు. అదేవిధంగా ఈ నెల 17న పర్యావరణ విద్య పరీక్ష ఉంటుందన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుందని, వార్షిక పరీక్షలకు నమోదు చేసుకున్న విద్యార్థులంతా తప్పనిసరిగా వీటికి హాజరుకావాలని సూచించారు. విద్యార్థులు వారు చదువుకున్న కాలేజీల్లోనే పరీక్ష రాసే అవకాశం ఉందని ఆమె తెలిపారు.

207 కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షలు

ఈ నెల 20 నుంచి మార్చి 7 వరకు జరిగే ప్రాక్టికల్స్ పరీక్షలకు విశాఖలో 126, అనకాపల్లిలో 65, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 16 కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ నెల 20 నుంచి ఒకేషనల్ కోర్సు, 26 నుంచి జనరల్ కోర్సులకు చెందిన విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని 355 జూనియర్ కాలేజీల్లో చదువుతున్న బైపీసీ విద్యార్థులు 16,439 మంది, ఎంపీసీ గ్రూపు నుంచి 4,840 మంది ప్రాక్టికల్ పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో విశాఖ, అనకాపల్లి డీవీఈవోలు రాయల సత్యనారాయణ, బి.సుజాత, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

• నోడల్ అధికారులకు విశాఖ కలెక్టర్ మల్లికార్జున ఆదేశం



ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. మార్చి 13న ఎమ్మెల్సీ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నోడల్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీవో, ఏపీవోలకు శిక్షణ తరగతులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. నామినేషన్ల స్వీకరణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేసుకుని సిద్ధంగా ఉండాలన్నారు. డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎస్డీసీలు తదితరులు పాల్గొన్నారు.

• ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అధికారులకు సూచించారు. విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, డీఆర్వోలతో ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ నెల 16 నుంచి ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ ప్రారంభం కానుందన్నారు. నామినేషన్ ప్రక్రియలో ఎటువంటి అవాంతరాలు ఎదురుకాకుండా చూడాలన్నారు.

• స్వర్ణభారతి స్టేడియంను మంగళవారం కలెక్టర్ మల్లికార్జున సందర్శించారు. స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ ఏర్పాట్లు, ఎన్నికల సామగ్రి పంపిణీ కౌంటర్లు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఎక్కడా ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా చర్యలు చేపట్టాలన్నారు. డీఆర్వో, ఆర్డీవోతో పాటు ఎస్‌డీసీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్, రెవెన్యూ, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర పట్టభద్రులు 2,87,258

• ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల తుది జాబితా ప్రకటన
• ఓటర్లలో పురుషులే అధికం

మహారాణిపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితాను ప్రకటించారు. తుది ఓటర్ల నమోదు కార్యక్రమం సోమవారంతో ముగియగా.. మంగళవారం నాటికి మొత్తం ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో 2,87,258 మంది ఓటర్లు ఉన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పూర్తి కావడంతో తుది ఓటర్ల జాబితా ప్రకటించారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీకు వచ్చే నెల 13న ఎన్నికలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. మొత్తం 2,87,258 మంది ఓటర్లలో పురుషులు 1,80,891, మహిళలు 1,06,329, ట్రాన్స్‌జెండర్లు(టీజీ) 38 మంది ఉన్నారు.

జిల్లాల వారీగా ఓటర్ల వివరాలివీ..

జిల్లా పేరు	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	మొత్తం ఓటర్లు
శ్రీకాకుళం	36,361	15,830	05	52,196
విజయనగరం	38,556	19,817	09	58,382
పార్వతీపురం మన్యం	12,399	5,959	02	18,360
అల్లూరి సీతరామరాజు	7,894	3,674	03	11,571
విశాఖపట్నం	58,105	47,117	13	1,05,235
అనకాపల్లి	27,576	13,932	06	41,514
మొత్తం	1,80,891	1,06,329	38	2,87,258

సజావుగా జరిగేందుకు సహకరించాలి

తుమ్మపాల: ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని రాజకీయపార్టీల నాయకులు సహకరించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, డీఆర్వో వెంకటరమణ కోరారు. అనకాపల్లి కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈనెల 16న నోటిఫికేషన్ విడుదల చేస్తారని, నామినేషన్ల స్వీకరణకు 23వ తేదీ వరకు గడువు ఉందని చెప్పారు. 24న పరిశీలన, 27 వరకు ఉపసంహరణకు గడువు ఉంటుందని తెలిపారు. 13న పోలింగ్, 16న ఓట్ల లెక్కింపు జరుగుతాయన్నారు. రాజకీయపార్టీలు ఎన్నికల నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. కోడ్ ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లాలో 46 పోలింగ్ కేంద్రాలు

అనకాపల్లిలో జిల్లాలో గతంలో 44 పోలింగ్ కేంద్రాలుండగా కొత్తగా మరో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రచార సామగ్రి, ప్రింటింగ్‌ప్రెస్ వివరాలు ఇవ్వాలన్నారు. 3,417 కొత్తగా ఓటర్లు చేరారని చెప్పారు. ఎన్నికల నిర్వహణలో వలంటీర్లను ఉపయోగించరాదని, ఎవరైనా పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్లు చంద్రశేఖర్, పి.లక్ష్మీదేవి, డీటీ రవికుమార్, బీజేపీ నుంచి సీహెచ్.నాగేశ్వరరావు, బీఎస్పీ నుంచి జి.చిన్నారావు, ఎస్వీ.రావు, సీపీఎం నుంచి ఆర్.శంకరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అటవీశాఖ జీడి మామిడి తోటలకు వేలం

నర్సీపట్నం: నర్సీపట్నం అటవీశాఖ రేంజ్ పరిధిలోని జీడిమామిడి తోటలకు మంగళవారం స్థానిక రేంజ్ కార్యాలయంలో వేలం నిర్వహించారు. జిల్లా స్క్వాడ్ డీఎఫ్‌వో సోమసుందరం సమక్షంలో దీనిని నిర్వహించారు. నాతవరం మండలంలోని మహ్మద్ షరీఫ్ జీడిమామిడి తోట, గొలగొండ మండలం ఆరిల్లోవ అటవీ ప్రాంతం, మాకవరపాలెం మండలం రాచపల్లి, కోటవురట్ల మండలం టి.జగ్గంపేట ప్రాంతాల్లోని జీడిమామిడి తోటలకు రేంజర్ లక్ష్మీ నర్సు వేలం నిర్వహించారు. ఈ వేలంలో 17 మంది పాటదారులు పాల్గొన్నారు. మహ్మద్ షరీఫ్ జీడిమామిడి తోటను రూ.16.50 లక్షలకు పి.సన్యాసిదేముడు పాడుకున్నారు. మిగిలిన జీడిమామిడి తోటలను పాడుకునేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో ఈ వీటికి మరోసారి వేలం నిర్వహిస్తామని రేంజర్ తెలిపారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

మాకవరపాలెం: దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న ఓ యువకుడు మనస్తాపంతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని కొండలఅగ్రహారం గ్రామానికి చెందిన పురందాసు సాయి(23) కొంతకాలంగా వ్యాధితో బాధపడుతున్నాడు. ఇదే గ్రామంలో ఉన్న ఇమ్మాన్యుయేల్ హెల్త్ కేర్ సెంటర్‌లో చికిత్స పొందుతున్నాడు. మనస్తాపం చెందిన సాయి ఆస్పత్రిలో మంగళవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన ఆస్పత్రి యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు.

ఉద్యోగులను ప్రోత్సహించేందుకు ఇన్‌స్పైర్ వెబ్‌సైట్

తుమ్మపాల: జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులను ప్రోత్సహించేందుకు ×ఇన్‌స్పైర్× అనే వెబ్‌సైట్‌ను జిల్లా యంత్రాంగం అందుబాటులోకి తెచ్చిందని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పేర్కొన్నారు. జిల్లాలో అంకితభావంతో పని చేస్తున్న ఉద్యోగులకు గుర్తింపునిస్తూ మరింత మెరుగ్గా పని చేసేందుకు ఈవెబ్‌సైట్ ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఒక ఉద్యోగి విజయగాథ ఈవెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు తెలిపారు. ఈ వెబ్‌సైట్‌ను ట్రైనీ కలెక్టర్ ధాత్రీరెడ్డి నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

కల్యాణపులోవ తిరునాళ్లకు ముమ్మర ఏర్పాట్లు

- 18 నుంచి ఉత్సవాలు ప్రారంభం
- భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం
- నూతనంగా విగ్రహాల ప్రతిష్ట



చండీ గౌరీశ్వరుని విగ్రహం



నూతనంగా ప్రతిష్ఠించిన విఘ్నేశ్వర విగ్రహం



నూతనంగా ఏర్పాటు చేసిన శివలింగం

రావికమతం: కల్యాణపులోవ కల్యాణపోతురాజు బాబు (శివాలయం) ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులు పూర్తి కావచ్చాయి. ఈ నెల 18, 19, 20 తేదీల్లో నిర్వహించనున్న మహా తిరునాళ్లకు పలు జిల్లాల నుంచి లక్షలాది మంది యాత్రికులు రానున్నారు. ఈ నేపథ్యంలో గతేడాది ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మంజూరు చేయించిన రూ.58 లక్షలతో మండపం, ప్రహరీ పూర్తి చేశారు. అయితే ఇక్కడ భిన్నమైన శివలింగం స్థానంలో మరొక శివలింగం ప్రతిష్టించి ఆ తర్వాత గ్రానైట్ ఇతర విగ్రహాల ప్రతిష్ట చేపట్టాలని అప్పట్లో పనులు ఆపేశారు. తాజాగా కాశీ నుంచి తీసుకువచ్చిన మరొక శివలింగంతోపాటు విఘ్నేశ్వర, చండీ గౌరీశ్వరుని విగ్రహాలు ప్రతిష్ఠించి, మండపంలో గ్రానైట్ పలకలతో సుందరంగా తయారు చేశారు. ఆలయంతోపాటు ప్రహరీకి రంగులు వేస్తున్నారు. ఉత్సవాలకు ఈ పనులన్నీ పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామని ఈవో బి.వి.ఎస్.ఎస్ మురళీకృష్ణ, ట్రస్టు బోర్డు చైర్మన్ పాడి పోతురాజు తెలిపారు.

తిరునాళ్ల ఏర్పాట్లపై సమీక్ష

కల్యాణపులోవ మహా తిరునాళ్ల ఏర్పాట్లపై కొత్తకోట పంచాయతీ కార్యాలయంలో మంగళవారం అధికారులు, ప్రజాప్రతినిధులు సమీక్షించారు. యాత్రీకుల కోసం ఆర్టీసీ 80 వరకూ ప్రత్యేక సర్వీసులు నడపనున్న దృష్ట్యా ట్రాఫిక్‌తోపాటు ఇతర సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు.

ఎంపీపీ పైల రాజు, డీసీఎంస్ డైరెక్టర్ సత్యదేవ, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవా, చోడవరం ఏఎంసీ వైస్ చైర్మన్ రాజాన నర్సింహులు, పార్టీ మండల కార్యదర్శి శీలం శంకర్రావు, ఎస్ఐ విభీషణరావు పాల్గొన్నారు. స్నానాల రేవులో పేరుకుపోయిన గుర్రపుడెక్క, నాచు తొలగించాలని, మహిళలు దుస్తులు మార్చుకోవడానికి ప్రత్యేక గదుల ఏర్పాటు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజనంతోపాటు ఉదయం అల్పాహారం కోసం 30 ప్రత్యేక కౌంటర్లు, షామియానాలు, బారికేడ్లు, తాగునీటి ప్యాకెట్లు, తదితర ఏర్పాట్లు ముమ్మరం చేయాలని నిర్ణయించారు.

నోడల్ అధికారుల నియామకం

మహారాణిపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా జిల్లాలో నోడల్ అధికారులను నియమిస్తూ కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 13న ఎమ్మెల్సీ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో.. వివిధ విభాగాలను ఈ నోడల్ అధికారులు పర్యవేక్షించనున్నారు.

- ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు(ఎంసీసీ), లా అండ్ ఆర్డర్, డిస్ట్రిక్ట్ సెక్యూరిటీ ప్లాన్, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్: కె.వి.రామలక్ష్మి, ఎస్‌డీసీ, భూసేకరణ విభాగం సింహాచలం, దేవస్థానం –99852 92437
- ఎన్నికల కమిషన్‌కు నివేదిక అందజేత/మీడియా సెల్‌కు సమాచారం: ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్‌డీసీ, ఎన్‌హెచ్ 16– 94411 40194, సీహెచ్ వి.రమేష్, ఎస్‌డీటీ, ఎన్‌హెచ్ 16
- 98499 11018, బి.వి.ఎల్.ఎన్.మూర్తి, ఎస్‌డీటీ కో–ఆర్డినేషన్(హెచ్)–98495 30239, జె.వి.ఎస్ చంద్రశేఖర్, జేఏ– ఎ సెక్షన్–83411 84778
- హెల్ప్ డెస్క్: ఎం.సత్య పద్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(కె.ఆర్.ఆర్.సి)– 9100 064971
- హెల్ప్ లైన్, ఫిర్యాదులు, మోనటరింగ్, కమ్యూనికేషన్ ప్లాన్: ఎస్.హెచ్.పాషా, అసిస్టెంట్ డైరెక్టర్ ఐవోఎస్– 82478 25057, జె.వి.ఎస్ చంద్రశేఖర్, జె.ఎ, అడ్మిన్ సెక్షన్– 83411 84778
- మెన్ పవర్ మేనేజ్ మెంట్: ఎల్.చంద్రకళ, డీఈవో – 98499 09103, ఆర్.విజయకుమార్, డిస్ట్రిక్ట్ సర్వే, లాండ్ రికార్డ్స్– 98661 69313
- ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్: జి.రాజారత్నం, డీటీసీ– 99846 61742, అప్పలనాయుడు, రీజనల్ మేనేజర్, ఆర్టీసీ– 99592 24529
- ట్రైనింగ్ మేనేజ్‌మెంట్: డి.హుస్సేన్ సాహెబ్, విశాఖ ఆర్డీవో– 98499 03825, భీమిలి తహసీల్దార్ కె.వేణుగోపాల్ – 80082 05734, ఎస్.హెచ్.పాషా, ఎస్ఐసీ అసిస్టెంట్ డైరెక్టర్– 82478 25057, సీహెచ్ అశోక్, ఈడీఎం 98662 25633
- మెటీరియల్ మేనేజ్‌మెంట్: జె.మాధవి, జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్– 93981 19866
- అబ్జర్వర్‌లు: డి.హుస్సేన్ సాహెబ్, ఆర్డీవో, ఎస్.వెంకటేశ్వర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, టి.ఆనందకుమార్, తహసీల్దార్, మహారాణిపేట– 9440151095
- బ్యాలెట్ పేపర్స్/పోస్టల్ బ్యాలెట్ పేపర్లు: డి.హుస్సేన్ సాహెబ్, ఆర్డీవో, జె.వి.ఎస్.ఎస్ రామ్మోహనరావు, స్టీల్‌ప్లాంట్ ఎస్‌డీసీ– 98499 03829
- మీడియా కమ్యూనికేషన్: వి.మణిరామ్, సమాచార శాఖ ఉప సంచాలకుడు– 91212 15253
- కంప్యూటరైజేషన్: ఎంజీ చంద్రశేఖర్, ఎన్ఐసీ డీఐవో– 94929 25474
- బ్యాలెట్ బాక్స్ నిర్వహణ: డి.సత్యనారాయణ, సీఈవో, జిల్లా పరిషత్– 91547 98982, పి.వి.వి.ఎన్ మూర్తి, ఏవో(ప్లానింగ్), జిల్లా పరిషత్– 63037 15547, వి.శ్యామ్ ప్రసాద్, తహసీల్దార్, సీతమ్మధార– 99498 67842

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 80 మంది ఎంపిక



విద్యార్థులతో మాట్లాడుతున్న హెటిరో సంస్థ హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్ విజయకుమార్ రెడ్డి

పాయకరావుపేట: హైదరాబాద్ హెటిరో డ్రగ్స్ ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో మంగళవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. విశాఖ, అనకాపల్లి, కాకినాడ జిల్లాలకు చెందిన వివిధ కళాశాలల నుంచి బీఎస్సీ, బి.ఫార్మసీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ, ఎం.ఫార్మసీ ఫైనలియర్ విద్యార్థులతోపాటు ఈ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు మొత్తంగా 250 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా సంస్థ హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్ విజయ్‌కుమార్ రెడ్డి అవగాహన కల్పించారు. సంస్థకు సంబంధించిన పద్ధతులను, నియమాలను, ఎంపిక ప్రక్రియను వివరించారు. తదుపరి సెలక్షన్ ప్రక్రియలో భాగంగా ఆన్‌లైన్లో రాత పరీక్షలు నిర్వహించి ఎంపికైన 121 మందికి హెచ్ఆర్ రౌండ్‌లను నిర్వహించారు. ఎంపిక ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసి 80 మంది హెటిరో డ్రగ్స్ ఫార్మా కంపెనీలో క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ అనాలసిస్, ప్రొడక్షన్ విభాగాల్లో పనిచేస్తారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వీర్రాజు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సిహెచ్.వి.కె. నరసింహారావు, సహాయ కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్ అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఆర్ ఎస్.వంశీ, సిహెచ్.మణికంత, క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ ఏడుకొండలు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పెనుగొండ సుబ్బారావు, కెమిస్ట్రీ విభాగాధిపతి వి.శివ గంగాధర్ పాల్గొన్నారు.

చెరువులో జారి పడి రైతు మృతి



వెంకునాయుడు మృతదేహాన్ని చెరువు నుంచి బయటకు తీస్తున్న దృశ్యం

చీడికాడ : అర్జునగిరిలో పశువులను ఒడ్డుకు చేర్చేందుకు ప్రయత్నించిన రైతు ప్రమాదవశాత్తూ కాలు జారి చెరువులో మునిగిపోయి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. సర్పంచ్ బి.రమాదేవి అందించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కసిరెడ్డి వెంకునాయుడు(63) మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో తన కల్లానికి సమీపంలో గల రామసాగరం అనే చెరువు వద్దకు పశువులకు మేతకు తోలుకు వెళ్లాడు. పశువులు నీరు తాగేందుకు చెరువులో దిగగా వాటిని బయటకు తోలేందుకు ప్రయత్నించిన వెంకునాయుడు కాలుజారి చెరువులో పడిపోయాడు. అతను కేకలు వేయడంతో దగ్గరలో గల రైతులు హుటాహుటిన వెంకునాయుడు కోసం చెరువులో గాలించారు. గంట సమయం తరువాత వెంకునాయుడు మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. మృతుడి భార్య భవానీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సుధాకరరావు సంఘటన స్థలాన్ని పరిశీలించి శవ పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

బాలికను లోబర్చుకున్న వ్యక్తిపై కేసు

అనకాపల్లిటౌన్ : గొలగాం గ్రామానికి చెందిన మైనర్ బాలికను అదే గ్రామానికి చెందిన పల్లా కనకరాజు మోసగించాడని గ్రామీణ పోలీసులు మంగళవారం తెలిపారు. బాలికకు మాయమాటలు చెప్పి గర్భం దాల్చడానికి కారణమైన కనకరాజుపై బాలిక తల్లి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామన్నారు.

300 కిలోల గంజాయి పటివేత

మోతుగుడెం : దబ్బగూడెం జంక్షన్ వద్ద మంగళవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో రెండు మహీంద్రా వాహనాలతో పాటు 12 ప్లాస్టిక్ సంచుల్లో ఉంచిన రూ.9లక్షల విలువైన 300 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు మోతుగుడెం ఎస్ఐ యాదగిరి తెలిపారు. నిందితులు రాజు కస్యప్, తనపాడై, సాదన్ సర్కార్‌లను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.

లంపీస్కిన్ టీకాలు తప్పనిసరి



గర్భకోశ పరీక్ష చేస్తున్న వైద్యాధికారులు ప్రసాద్, భానుబాబు



రైతుకు పశుదాణా అందిస్తున్న ప్రసాద్

- జిల్లా పశుసంవర్థక శాఖాధికారి ప్రసాద్

అనకాపల్లిటౌన్ : ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి బి.ప్రసాద్ అన్నారు. మండలంలోని మార్టూరు గ్రామంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ, పశుసంవర్థకశాఖల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశు వైద్యశిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడిపశువులకు లంపీస్కిన్ టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. నాలుగు నెలల వయస్సు దాటిన ఆడపెయ్యిలకు బుసెల్లోసిస్, జీవాలకు చీడపారుడు వ్యాధి టీకాలు క్రమం తప్పకుండా వేయించాలని సూచించారు. రాయితీతో కూడిన సంపూర్ణ మిశ్రమ దాణాను రైతులు ఉపయోగించుకోవాలన్నారు. మూగజీవాల అత్యవసర చికిత్సకోసం డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా టోల్‌ఫ్రీ నెం.1962కు ఫోన్‌చేస్తే పశువు ఉన్న ప్రాంతానికి వచ్చి వైద్యసేవలందిస్తారని తెలిపారు. గర్భకోశ చికిత్స నిపుణులు బి.భానుబాబు 52 పశువులకు గర్భకోశ పరీక్షలు చేపట్టారు. నియోజకవర్గ వ్యాధి నిర్ధారణ కేంద్రం సిబ్బంది పశువుల పేడ నమూనాలను పరీక్షించి నట్టల నివారణ మందులు అందజేశారు. 200 జీవాలకు చీడపారుడు వ్యాధి టీకాలు వేశారు. ఏరియా పశువైద్యశాఖ సహాయ సంచాలకులు సౌజన్య, వైద్యులు అనిల్‌కుమార్, సంధ్య, గ్రామ సర్పంచ్ కరణం రెవెన్యూనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు మిద్దె రాజారావు, పాడి రైతులు పాల్గొన్నారు.

దాడిలో గాయపడిన యువకుడి మృతి

- పాత కక్షలతోనే చంపారని మృతుడి తల్లి ఫిర్యాదు



దాడి జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రవీణ్‌కుమార్ (ఇన్‌సెట్) హత్యకు గురైన దంటు ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

ఎస్.రాయవరం : అడ్డురోడ్డు జంక్షన్ సమీపంలో మద్యం దుకాణం వద్ద సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో దాడికి గురైన యువకుడు దంటు ప్రవీణ్ కుమార్(23) అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో మృతి చెందినట్టు నక్కపల్లి సీఐ నారాయణరావు మంగళవారం తెలిపారు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొరుప్రోలు గ్రామానికి చెందిన దంటు ప్రవీణ్‌కుమార్, అదే గ్రామానికి చెందిన చొప్పా రమణ కుమార్తెను ప్రేమించడంతో ఉద్దేశపూర్వకంగా చొప్పా రమణ ప్రవీణ్‌కుమార్‌ను హత్య చేశాడని మృతుడి తల్లి దండు సత్య ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. 8 నెలలు క్రితం చొప్పా రమణకు, తన కుమారుడు ప్రవీణ్‌కుమార్‌తో గొడవ అయ్యిందని, అప్పటి నుంచి తమ కుమారుడిని చంపుతామని బెదిరించేవాడన్నారు. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి పెదగుమ్ములూరు మద్యం దుకాణం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో దాడి చేశారని, రక్తపు మడుగులో ఉన్న తమ కుమారుడిని స్థానికులు ఆస్పత్రికి తీసుకెళ్లినా ప్రాణాలు దక్కలేదని వాపోయిందన్నారు. చొప్పా రమణ పాత గొడవలు మనసులో పెట్టుకుని తన కొడుకుని అత్యంత దారుణంగా కత్తితో నరికి, కత్తి అక్కడే వదిలి పరారైనట్టు మద్యం దుకాణం వద్ద చూసిన వారి ద్వారా తెలిసినట్టు చెప్పిందన్నారు. చొప్పా రమణపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరినట్టు చెప్పారు. కాగా నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్‌కుమార్ సంఘటన స్థలాన్ని మంగళవారం పరిశీలించారన్నారు. నిందితులను పట్టుకుని అరెస్టు చేస్తామని చెప్పారు. ఈ మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.


విద్యుత్ స్తంభం పడి విద్యార్థిని మృతి



హుకుంపేట ఆస్పత్రిలో మృతదేహంతో ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు (ఇన్‌సెట్) మృతి చెందిన విద్యార్థిని దన్విత

హుకుంపేట: విద్యుత్ స్తంభం పడి ఓ విద్యార్థిని మృతి చెందగా, మరో విద్యార్థినికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో తాడిపుట్టు పంచాయతీ ఉర్రాడ బొడ్డాపుట్టు గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నాడు–నేడు పనులు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఆరుబయట విద్యాబోధన నిర్వహిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో పాఠశాల పక్కన ఉన్న జీలుగు చెట్టు విద్యుత్ తీగలపై పడడంతో నాలుగు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. పాఠశాలకు ముందు ఉన్న స్తంభం విరిగి ఆరుబయట విద్య అభ్యసిస్తున్న ఆరో తరగతి చదువుతున్న తూబురు దన్విత తలపై పడింది. మరో విద్యార్థిని నిహారిక నడుముపై పడింది. దీనిని గమనించిన గ్రామస్తులు వెంటనే విద్యార్థులను హుకుంపేట ఆస్పత్రికి తరలించారు. అప్పటికే దన్విత మృతి చెందినట్టు వైద్యాధికారులు తెలిపారు. మరో విద్యార్థినికి తీవ్ర గాయాలు కావడంతో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆస్పత్రి వద్దకు చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. ఎంఈవో రామచంద్రరావు, ఎంపీడీవో వెంకటరావు బొడ్డాపుట్టు పాఠశాల వద్దకు చేరుకుని సంఘటనను పరిశీలించారు. ఎస్ఐ సతీష్ ఆస్పత్రి వద్దకు చేరుకుని వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేశారు. విద్యార్థి మృతికి కారకులైన ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలని, తమకు న్యాయం చేయాలని హుకుంపేట ఆస్పత్రిలో మృతుని తల్లిదండ్రులు ఆందోళన చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వాకపల్లిలో వివాహిత ఆత్మహత్య



మృతురాలు చిన్ని అచ్చియ్యమ్మ

దేవరాపల్లి : మండలంలోని వాకపల్లిలో వివాహిత చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. దీనికి సంబంధించి దేవరాపల్లి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చిన్ని అచ్చియ్యమ్మ(33)కు కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుంది. అప్పటి నుంచి మానసిక పరిస్థితి సక్రమంగా లేదు. అనారోగ్యం కారణంగా రెండు నెలల క్రితం చోడవరం మండలం లక్కవరంలోని తన భర్త అప్పలనాయుడు వద్ద నుంచి తన అమ్మగారి గ్రామమైన వాకపల్లికి వచ్చేసింది. మానసిక స్థితి సక్రమంగాలేని సదరు వివాహిత అచ్చియ్యమ్మ మంగళవారం అర్ధరాత్రి అందరూ నిద్రపోయాక డాబా పైకి వెళ్లి ఇంటికి ఆనుకొని ఉన్న చింతచెట్టు కొమ్మకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అచ్చియ్యమ్మ తల్లి కొట్యాడ బంగారయ్య మేడపైకి వెళ్లి చూసి చెట్టు కొమ్మకు వేలాడి ఉండడాన్ని గమనించింది. వెంటనే కుటుంబీకుల సహాయంతో 108 వాహనంలో కె.కోటపాడు కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు హెడ్‌కానిస్టేబుల్ అప్పారావు తెలిపారు.

ప్రజా రవాణా శాఖ స్థలాల్లో అభివృద్ధిపై సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న పద్మావతి

అనకాపల్లిటౌన్: అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ప్రజారవాణాశాఖ(ఆర్టీసీ)కి చెందిన ఖాళీ స్థలాల్లో పబ్లిక్, ప్రైవేటు పార్టనర్‌షిప్(పీపీపీ) పద్ధతిలో అభివృద్ధిపై స్థానిక జిల్లా శాఖ కార్యాలయంలో మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి కె.పద్మావతి మాట్లాడుతూ అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, పాడేరు డిపోల్లో ఖాళీస్థలాలను ప్రైవేటువ్యాపారులకు లీజుకిచ్చి అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమానికి హాజరైన 20 మంది వ్యాపారవేత్తల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రవాణాశాఖ అధికారులు కె.అప్పలనాయుడు, వెంకటరావు, డిపో మేనేజర్ సుజాత పాల్గొన్నారు.

నాటుపై వేటు

- 15 మంది అరెస్టు
- 600 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం
- రూ.12,045 నగదు స్వాధీనం
- అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్ వెల్లడి

అనకాపల్లిటౌన్ : జిల్లాలో మద్యం నిల్వలు, ఇసుక, గంజాయి, పశువుల అక్రమ రవాణా, కోడిపందాలు, జూదంపై జిల్లా ఎస్పీ గౌతమి సాలి ఆదేశాల మేరకు దాడులు నిర్వహించినట్టు అడిషనల్ ఎస్పీ(పరిపాలన) విజయభాస్కర్ పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జూదం, కోడిపందాలు ఆడుతున్న వారిపై దాడులు నిర్వహించి 10 మందిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. మూడు కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఒక కోడి, రూ.12,045 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎస్ఈబీ పోలీసులు 600 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం చేసి, 9 లీటర్ల నాటు సారా, 7 లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకొని అయిదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు.

భార్యాపిల్లలు అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు



ఆచూకీ తెలియని వెంకటలక్ష్మి, పిల్లలు

పాయకరావుపేట : గజపతినగరం గ్రామానికి చెందిన బడే తాతారావు అనే వ్యక్తి తన భార్య, పిల్లలు కనిపించడం లేదని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ ఎస్.రమేష్ తెలిపారు. తాతారావు భార్య వెంకటలక్ష్మి, పిల్లలు భవానీ ప్రసాద్, రమ్యులు ఈ నెల 9వ తేదీ నుంచి కనిపించడం లేదని తెలిపారన్నారు. 9వ తేదీన ఎస్.నర్సాపురం పాఠశాలకు పిల్లల్ని పంపించి, తర్వాత తల్లి వెంకటలక్ష్మి పాఠశాలకు పిల్లల దగ్గరకు వెళ్తున్నానని చెప్పి వెళ్లి ఇంతవరకు కనిపించలేదన్నారు. వారి కోసం బంధువుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఆచూకీ తెలియరాలేదని ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం



ప్రమాదంలో కాలిపోయిన కారు

మాకవరపాలెం : షార్ట్ సర్క్యూట్ కారణంగా కారు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా కాలిపోయింది. కోటవురట్లలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈగా పని చేస్తున్న గెద్దం కరుణ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఎదురుగా ఓ అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నారు. ఈమె కారును నిత్యం ఇంటి ముందే పార్కింగ్ చేస్తారు. ఈ నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి ఒక్కసారిగా కారు ముందు భాగం నుంచి మంటలు చెలరేగాయి. విశాఖ–నర్సీపట్నం ప్రధాన రహదారి పక్కనే కారు దగ్ధం అవుతుండడంతో గమనించిన స్థానికులు వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో అగ్నిమాపక వాహనంతో సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు.

క్లుప్తంగా

చిదంబరస్వామి పల్లకీ ఊరేగింపు



పల్లకిలో ఊరేగుతున్న చిదంబరస్వామి

కశింకోట : కశింకోటలో పాలూరి కుటుంబీకుల ఇలవేల్పు చిదంబరస్వామి ఉత్సవంలో భాగంగా సోమవారం రాత్రి స్వామివారిని పల్లకిలో గ్రామ వీధుల్లో ఘనంగా ఊరేగించారు. నాలుగేళ్లకోసారి నిర్వహించే ఉత్సవంలో పాలూరి కుటుంబీకులు, స్థానికులు ఉత్సాహంగా పాల్గొని, స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. భారీగా బాణసంచా కాల్చారు.

సచివాలయ సిబ్బందికి ధ్యానంపై శిక్షణ



ధ్యాన సాధనలో సచివాలయ సిబ్బంది

కశింకోట : మండలంలోని అచ్చెర్ల, జి.భీమవరం సచివాలయాల్లో మంగళవారం ధ్యానంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ధ్యానం ఎలా ఆచరించాలో అవగాహన కల్పించారు. మిషన్ ప్రతి నిధులు మురళి, మాధవి, రాజు తదితరులు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

ఆర్టీఐ కార్యకర్తల సంఘం కన్వీనర్‌గా అమ్మిశెట్టి



అమ్మిశెట్టి లక్ష్మణ్‌కుమార్

కశింకోట : అనకాపల్లి జిల్లా సమాచార హక్కు చట్టం కార్యకర్తల సంఘం కన్వీనర్‌గా కశింకోటలోని హౌసింగ్ కాలనీకి చెందిన అమ్మిశెట్టి లక్ష్మణ్ కుమార్ నియమితులయ్యారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు ముత్తు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు మంగళవారం ఒక ప్రకటనలో లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. సమాచార చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించి, వారిని చైతన్య పరుస్తానన్నారు. చట్టం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 8,553 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,600	4,210
మొదటి రకం	3,290	3,710
రెండో రకం	3,100	3,510
మూడో రకం	2,900	3,080

అనకాపల్లి సినిమాలు

పాప్‌కార్న్	- రాజా
వేద	-సత్యనారాయణ స్క్రీన్-1
అమిగోస్	-సత్యనారాయణ స్క్రీన్-2
18 పేజెస్	-షిర్డిసాయి
పఠాన్	-పర్తిసాయి
వీరసింహారెడ్డి	-వెంకటేశ్వర
చడ్డీగ్యాంగ్ (ఉదయం, మధ్యాహ్నం)	- శ్రీసత్య
వారసుడు (ఫస్ట్ షో, సెకండ్ షో)	- శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	- రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 110 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు , బీ పాజిటివ్-55 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-43 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 398 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 367 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

రోడ్లే కాలువలు

- పూడుకుపోయిన మురుగునీటి కాలువలు
- రోడ్లపై మురుగునీటి నిల్వతో దుర్గంధం
- పూడికలు తొలగించాలని స్థానికుల మొర



సాయిబాబా ఆలయం వెనుక భాగంలో రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు

అనకాపల్లిటౌన్ : పట్టణంలోని పలు ప్రాంతాల్లో రహదారులు మురుగు కాలువలను తలపిస్తున్నాయి. నెలల తరబడి కాలువల్లో పూడికలు తొలగించకపోవడంతో గృహాల నుంచి వచ్చే మురుగునీటికి రోడ్లే కాలువలుగా మారుతున్నాయి. వర్షాకాలానికి ముందు కొన్ని చోట్ల పూడికలు తొలగించారు. అది కూడా నామమాత్రంగానేనని స్థానికులు చెప్తున్నారు. కొన్ని చోట్ల కాలువలు శిథిలావస్థకు చేరుకోవడం, మరి కొన్ని చోట్ల పూడికలతో మురుగు నీరు కూడా వెళ్లేందుకు వీల్లేని స్థాయికి చేరుకున్నాయి.

దుర్గంధం.. దోమల వ్యాప్తి

స్థానిక నర్సింగరావుపేట, శ్రీరామ్‌నగర్, ఏఎంసీ కాలనీ, గొల్లవీధి, గవరపాలెం తదితర ప్రాంతాల్లో కాలువలు పూర్తిగా పూడుకుపోయాయి. దీంతో రహదారులపై మురుగునీరు ప్రవహిస్తోంది. నర్సింగరావుపేటలోని సాయిబాబా ఆలయం వెనుక భాగం రోజంతా మురుగునీటిలోనే ఉంటుంది. ఈ వీధిలో నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్ డెబ్రిస్ చెర్లోపల్లి కాలువలో పడేయడంతో కాలువ మూసుకుపోయింది. దీంతో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా స్తంభించింది. కాలువలో నిలిచిన మురుగు నీటి దుర్గంధంతో ముక్కుపుటాలు అదురుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. మురుగునీటితో దోమల వ్యాప్తి పెరిగి రోగాలు ప్రబలుతున్నాయని గగ్గోలు పెడుతున్నారు.

సర్కస్ ఫీట్లు

పట్టణంలో పలు రోడ్లపై నడవాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సిందే. వేల్పులవీధిని ఆనుకుని ఉన్న ఎల్లయ్య కాలువలో పూడిక పేరుకుపోవడంతో రోడ్డుపై గోతుల్లో నీరు చేరింది. ఈ దారిలో నడిచి వెళ్లాలంటే మురుగులో కాళ్లు తడవాల్సిందే. గోతుల్లో కాలుజారి గాయపడిన దాఖలాలున్నాయి. వాహనాలపై వెళ్లేవారైతే.. కళ్లన్నీ రోడ్డుపై పెట్టాల్సిందే. ఈ రోడ్లనానుకుని ఉన్న ప్రజలు తమ ఇళ్లల్లోకి రాకపోకలు సాగించాలంటే ఫీట్లు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. చిన్నపాటి చెరువును తలపిస్తున్న ఈ మురుగునీటిలో నడిస్తే ఏ రోగాలు అంటుకుంటాయోనని ఆందోళన చెందుతున్నారు. పిల్లలు, వృద్ధులు ఈ మురుగునీటిలో నడవలేక నానా తిప్పలు పడుతున్నారు.



గొల్లవీధిలో పూడికతో నిండిన కాలువ

పూడిక తొలగించాలి



అనకాపల్లి పట్టణంలోని వీధి కాలువలు, పట్టణం గుండా ప్రవహించే ప్రధాన కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టాలి. యల్లయ్య కాలువలో లక్ష్మీదేవిపేట రైల్వే స్టేషన్ నుంచి వేల్పులవీధి మీదుగా గవరపాలెం వెళ్లే కాలువ పూడుకుపోయి, మురుగునీటితో దుర్గంధం వ్యాపిస్తోంది. భరించలేకున్నాం.

– రాజు, అనకాపల్లి

దశలవారీ పూడికతీతలు

ప్రధాన కాలువల్లో పేరుకున్న పూడిక సమస్య మా దృష్టికి వచ్చింది. దశలవారీ పూడిక తొలగింపు చర్యలు చేపడతాం. ప్రధాన కాలువల వద్దనున్న ప్రజలకు కూడా బాధ్యతగా వ్యవహరించాలి. డెబ్రిస్ వేసే వాళ్లను గుర్తించి, నిరోధించాలి. వారి సమాచారాన్ని అందించి జీవీఎంసీ సిబ్బందికి సహకరించాలి.

– వెంకటరమణ, జోనల్ కమిషనర్

దశలవారీగా డ్రైనేజీ, రోడ్ల నిర్మాణం



చవితినవీధిలో డ్రైనేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ మందపాటి సునీత

అనకాపల్లిటౌన్ : డ్రైనేజీ, రహదారి వ్యవస్థను మెరుగుపరిచేందుకు దశల వారీగా కృషి చేస్తున్నట్లు 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత అన్నారు. మంగళవారం నర్సింగరావుపేట, చవితినవీధిల్లో పర్యటించి, ఆయా ప్రాంత ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో స్థానికుల ప్రతి సమస్యను తీర్చేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధాన రహదారిలో ప్రమాదాల నియంత్రణకు హైమాస్ట్ విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, పార్టీ నేతలు చవితిన కాంతం, నూకరాజు, కూండ్రపు సత్తిబాబు, చింత రాంజీ, సతీష్‌రెడ్డి, ఖాతా ముఖేష్, మురళీ, కాపారపు దివాకర్, శివ తదితరులు పాల్గొన్నారు.

మరిడిమాంబ జాతర మహోత్సవం రేపు

- నేడు అమ్మవారి ఘటాల ఊరేగింపు



అమ్మవారి జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గ్రామ కమిటీ సభ్యులు

అనకాపల్లిటౌన్ : విజయరామరాజుపేట శ్రీ మరిడిమాంబ అమ్మవారి మహోత్సవం ఈ నెల 16న ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి పలకా రాము తెలిపారు. స్థానిక మరిడిమాంబ అమ్మవారి ఆలయ ఆవరణలో గ్రామ కమిటీ చైర్మన్ ఆళ్ల శివరామ సత్యనారాయణ అధ్యక్షత మంగళవారం విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం తెల్లవారుజాము నుంచి అమ్మవారి జాతర మహోత్సవం ప్రారంభమవుతుందన్నారు. బుధవారం అమ్మవారి ఘటాలు ఊరేగింపునకు భారీ స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్టు వెల్లడించారు. 116 సంవత్సరాల చరిత్ర కలిగిన అమ్మవారి ఉత్సవానికి దేశంలోని వివిధ ప్రాంతాలల్లో స్థిరపడిన పేట ప్రజలు తరలి వచ్చి, ఉత్సవంలో ఉత్సాహంగా పాల్గొంటారని పేర్కొన్నారు. ఏటా మాఘమాసంలో మొదటి గురువారం దుర్గమ్మ పండగ, రెండో గురువారం మరిడిమాంబ అమ్మవారి పండగను పూర్వీకుల నుంచి ఆనవాయితీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఎక్కడా గ్రామ కమిటీలు లేవని, పేటలో ఏదైన సమస్య వచ్చినట్లుయితే గ్రామ కమిటీ ద్వారా పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

అనంతరం అమ్మవారి జాతర పోస్టర్‌ను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు బొబ్బిలి అప్పారావు, కోశాధికారి పెట్ల బుద్దీస్, సభ్యులు కుండల రామకృష్ణ, పలకా సత్యనారాయణ, ఆడారి కుమారస్వామి, ఉగ్గిన నర్సింగరావు, ఉగ్గిన శ్రీను, ఆళ్ల సూర్యరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఎంపీని కలిసిన ఎస్‌బీఐ ఆర్‌ఎం



ఎంపీ సత్యవతిని సత్కరిస్తున్న ఎస్‌బీఐ ఆర్‌ఎం సత్యానంద్

అనకాపల్లిటౌన్ : ఎంపీ సత్యవతిని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ సత్యానంద్ మంగళవారం ఎంపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలో ఎస్‌బీఐ రీజినల్ కార్యాలయం నూతనంగా ఏర్పడిన నేపథ్యంలో తమకు సహకరించాలని ఎంపీ సత్యవతిని కోరారు. అంతకుముందు దుశ్శాలువాతో ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ వి.సర్వేష్‌కుమార్, బ్రాంచ్ మేనేజర్ లక్ష్మీపతి, హెచ్‌ఆర్ రమాదేవి, సిబ్బంది ఆర్.రవికుమార్, జి.ఉదయ్‌కుమార్, ఎస్.జ్ఞానేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యమాంబ జాతర



అమ్మవారి విగ్రహానికి పూలదండలతో అలంకరణ

కశింకోట : మండలంలోని తేగాడ గ్రామంలో మంగళవారం ముత్యమాంబ అమ్మవారి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. రెండేళ్లకోసారి జరిగే ఉత్సవం పురస్కరించుకుని ముత్యమాంబ అమ్మవారి ప్రతిమను పూలదండలతో అందంగా అలంకరించి పూజలు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని చీరలు, రవికెలు, అరటి గెలలు తదితర రూపాల్లో మొక్కుబడులు తీర్చుకున్నారు. రాత్రి డప్పులు, వాయిద్యాలతో గ్రామంలో అమ్మవారి జాతర ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. విద్యుత్ దీపాలంకరణ, బాణసంచా వెలుగులు, రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పూజా కార్యక్రమంలో సర్పంచ్ నీటిపల్లి ఈశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు నీటిపల్లి దివాకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నీటిపల్లి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం'



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ

కశింకోట : స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తూ కశింకోటలో మంగళవారం ర్యాలీ జరిగింది. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద మండల సమాఖ్య ఏరియా సమన్వయకర్త వి.ధర్మారావు ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించి నేల తల్లిని కాపాడుకోవాలని కోరారు. నవ ధాన్యాల విత్తనాలు నాటి భూసారాన్ని పరిరక్షించాలని సూచించారు. 30 రకాల విత్తనాలను వేసుకుని ఆదాయాన్ని పెంచుకోవాలని పేర్కొన్నారు. ఏపీఎం ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లోని రైతులతోపాటు చుట్టు పక్కల రైతులు కూడా ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గచూపేలా సీసీలు, వీవోఏలు ప్రోత్సహించాలన్నారు. ఇంటి పెరడులో కూరగాయలు, ఆకు కూరలు సాగు చేసుకోవాలన్నారు. ఆరోగ్యకర జీవనానికి చిరు ధాన్యాలు సాగుచేసి, వాటిని ఆహారంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మడల మహిళా సామాఖ్య అధ్యక్షురాలు కె. అరుణ, గ్రామ సంఘం వీవోఏలు, సీసీలు, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే చెరకాం గ్రామంలో కూడా ప్రకృతి వ్యవసాయంపై ప్రచారం చేస్తూ ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ దేముళ్లు, స్థానికులు పాల్గొన్నారు.

జాతర్లతో ప్రజల్లో ఐక్యత

- గంగాలమ్మ జాతరలో ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి



గంగాలమ్మను దర్శించుకుంటున్న ఎంపీ సత్యవతి దంపతులు

అనకాపల్లి రూరల్: జాతరల నిర్వహణ వలన ప్రజల్లో ఐక్యత, ఆధ్యాత్మిక భావం పెంపొందేందుకు అవకాశముంటుందని అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు భీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. మంగళవారం మండలంలోని తుమ్మపాలలో గంగాలమ్మ జాతరకు హాజరైన ఆమె అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఎంపీ దంపతులకు తీర్థప్రసాదాలు అందించి, సత్కరించారు. జాతర సందర్భంగా గంగాలమ్మ ఆలయం వద్ద విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, అన్నపూర్ణ బ్యాంకు చైర్మన్ గాంధీ, బీఎస్ఎన్ఎల్ జిల్లా సలహా కమిటీ సభ్యుడు పీలా విశ్వేశ్వరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు మాడిటి రామునాయుడు, పీలా బుజ్జి, పంచాయతీ వార్డు సభ్యుడు తగ్గ సత్యారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా భవనాల పూర్తికి చర్యలు



జి.భీమవరంలో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో కొంకి అప్పారావు

కశింకోట : ప్రాధాన్యతా భవనాలను నిర్దేశించిన లక్ష్యం మేరకు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కొంకి అప్పారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలోని జి.భీమవరం గ్రామంలో సంపద కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రం భవనాలను మంగళవారం ఆయన పరిశీలించారు. అలాగే ఆయుష్మాన్ భారత్ కార్డుల ఈకేవైసీపై సమీక్షించారు. సర్పంచ్ హనుమంతు వెంకట లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శి బి.చిన్నోడు, సచివాలయ కన్వీనర్ హనుమంతు నానిబాబు, ఫీల్డు అసిస్టెంట్ ఎం.గణేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లిటౌన్ : జంగిల్ క్లియరెన్స్‌లో భాగంగా పట్టణంలో బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు విద్యుత్‌శాఖ ఈఈ రమణమూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గాంధీబొమ్మ కూడలి, రింగ్‌రోడ్డు, పెరుగు బజారు, చిన్నవీధి, చేపల బజారు, నెయ్యిలవీధి ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆయా ఏరియాల వినియోగదారులు తమకు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

ఇంటింటా త్రైత సిద్ధాంత ధర్మ ప్రచారం



ధర్మ ప్రచారం చేస్తున్న త్రైత సిద్ధాంత ప్రచార కమిటీ ప్రతినిధులు

అనకాపల్లి రూరల్: స్థానిక ఎన్టీఆర్ కాలనీ, అక్కిరెడ్డిపాలెంలో మంగళవారం త్రైత సిద్ధాంత భగవద్గీత ధర్మ ప్రచార కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. దీనిలో భాగంగా త్రైత సిద్ధాంత హిందూ జ్ఞాన వేదిక, ప్రబోధ సేవా సమితి అనకాపల్లి కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు మణి, దేవి, రేవతి తదితరులు ఇంటింటా పర్యటించారు. దైవ జ్ఞానం తెలుసుకోవడానికి ప్రతీ ఒక్కరూ త్రైత సిద్ధాంత భగవద్గీతను చదవాలన్నారు. కృష్ణ ప్రేమను తెలుసుకోవడానికి ఈ గ్రంథం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఇంటా త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాన్ని పరిచయం చేయడమే తమ లక్ష్యమన్నారు.

వివాదాస్పద స్థలం పరిశీలన



ఆర్‌అండ్‌బీ రహదారిని పరిశీలిస్తున్న అధికారులు

పరవాడ: మండలంలోని పి.బోనంగిలో ఇరు వర్గాల మధ్య కాలువ నిర్మాణ విషయంలో తలెత్తిన వివాదాస్పద స్థలాన్ని రోడ్లు భవనాల శాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. గ్రామంలో ఆర్ అండ్‌బీ రోడ్డును ఆనుకుని పంచాయతీ నిధులతో పాలకవర్గం డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు చేపట్టింది. సదరు స్థలం తనదంటూ మాజీ సర్పంచ్ రాయవరపు దేముడు అభ్యంతరం తెలిపారు. దీంతో కాలువ నిర్మాణం నిలిచిపోయింది. కాలువ నిర్మాణం చేపట్టిన స్థలం ఆర్ అండ్ బీ పరిధిలో ఉందని గ్రామ సర్పంచ్ బండారు కల్పన రాజశేఖర్ వాదిస్తూ సమస్యను రెవెన్యూ, రోడ్డు భవనాల శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. సర్పంచ్ ఫిర్యాదు మేరకు రోడ్లు భవనాల శాఖ ఈఈ రమేష్, డీఈ సాగర్, ఏఈ లలిత వివాదాస్పద స్థలాన్ని పరిశీలించారు. అధికారుల వెంట పరవాడ జెడ్పీటీసీ పి.సన్యాసిరాజు, సర్పంచ్ కల్పనరాజశేఖర్, మాజీ ఎంపీటీసీ డెక్క శ్రీనివాసరావు ఉన్నారు.

ప్రణాళికాయుత చదువుతో ఉత్తమ ఫలితాలు



విద్యార్థులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ ధాత్రిరెడ్డి

కశింకోట : ప్రణాళికాబద్ధంగా చదివి టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేయాలని ట్రైనీ కలెక్టర్ ధాత్రిరెడ్డి కోరారు. మండలంలోని వెదురుపర్తి, తాళ్లపాలెం, డీపీఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఆయా పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులతో మమేకమయ్యారు. వారి చదువుల తీరును పరిశీలించారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే అచ్చెర్లలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. సమగ్ర భూముల రీ సర్వేను పరిశీలించారు.

ప్రతి పంటకూ ఈ క్రాప్ నమోదు తప్పనిసరి



మల్లునాయుడుపాలెంలో పంటలను పరిశీలిస్తున్న డీడీ వెంకటేశ్వర్లు తదితరులు

సబ్బవరం: రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల నుంచి లబ్ధి పొందాలంటే తప్పనిసరిగా ఈ పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.వెంకటేశ్వర్లు చెప్పారు. రైతులు వేసిన ప్రతి పంటను వ్యవసాయ సహాయకులు విధిగా ఈ పంటలో నమోదు చేయాలని సూచించారు. మండలంలోని గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాలను మంగళవారం ఆయన సందర్శించి పంటలను పరిశీలించారు. క్షేత్ర పరిశీలన చేసి, ఈ క్రాప్ నమోదుపై వ్యవసాయ సహాయకులను, రైతులను ఆరా తీశారు. ఈ పంట నమోదు జాబితాల ఆధారంగా జాబితాలోని రైతులను పిలిచి పంట రకాలు, నీటి సదుపాయం, రైతుల వివరాలు, సాగుచేస్తున్న పంటల వివరాలు సరిగా నమోదు చేశారా లేదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. రబీ సీజన్‌లో వ్యవసాయ, ఉద్యాన పంటలు 1100 ఎకరాల్లో సాగుచేస్తున్నట్టు ఆయనకు వివరించారు. కార్యక్రమంలో అనకాపల్లి డీఏవో బి.మోహనరావు, ఏడీఏలు వసంత కుమారి, రామారావు, మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, రైతులు, గ్రామ పెద్దలు బోను గంగునాయుడు, ఎంపీటీసీ గొర్లి కనకరాజు, ఏఈవో బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి



సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్ మధుసూదనరావు

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో మంగళవారం సంజీవయ్య 102వ జయంతిని ఘనంగా నిర్వహించారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య డాక్టర్ మధుసూదనరావు సంజీవయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సంజీవయ్య అణగారిన వర్గం నుంచి వచ్చినప్పటికీ స్వయం కృషితో ఎదిగారన్నారు. ఆంధ్రప్రదేశ్ తొలి హరిజన ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా ఆ పదవులకే వన్నె తెచ్చారని కొనియాడారు. కృషి ఉంటే ఏ స్థాయికైనా చేరుకోవచ్చేదానికి ఆయన జీవిత చరిత్ర నిదర్శనమన్నారు.

ఆత్మ విశ్వాసంతో ఒత్తిడి దూరం



మాట్లాడుతున్న డైట్ అధ్యాపకురాలు మాధవి

సబ్బవరం: విద్యార్థులంతా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుని ఒత్తడిని అధిగమించి పరీక్షలు రాయడం వల్ల మంచి ఫలితాలు వస్తాయని డైట్ అధ్యాపకురాలు, పరీక్ష పర్వ సమన్వయకర్త జె.మాధవి అన్నారు. సబ్బవరం కేజీబీవీలో పరీక్ష పర్వ 4.0లో భాగంగా విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొన్నారు. పరీక్షల సమయంలో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించడానికి అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులు ఏ విధంగా పెంపొందించుకోవాలో వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌వో మృదుల, మిగిలిన బోధన సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు రొట్టెల పంపిణీ

అనకాపల్లిటౌన్ : స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో ఫిబ్రవరి 14ను బ్లాక్ డేగా పరిగణిస్తూ సర్వేజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సరిహద్దు రక్షణ దళం సభ్యుల్ని తీవ్రవాదులు మట్టుబెట్టిన ఇదే రోజును దేశమంతా బ్లాక్ డేగా నిర్వహించుకోవాలన్నారు. అంతకుముందు రోగులకు వేదిక వ్యవస్థాపకుడు కోరిబిల్లి పరి రొట్టెలు అందజేశారు.

ఈఎస్ఐ ఏర్పాటు చేయాలని వినతి

పరవాడ: మండల కేంద్రమైన పరవాడలో కార్మికుల సౌకర్యార్థం ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. డీఆర్వో వెంకటరమణకు మంగళవారం వినతి పత్రం అందించారు. ఎన్టీపీసీ, ఫార్మాసిటీ, చిన్న పరిశ్రమల్లో పనిచేస్తోన్న సుమారు 40 వేల మంది కోసం ఈఎస్ఐ ఆస్పత్రి ప్రారంభించాలని కోరారు.